క్లుప్తంగా

ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: బండిఆత్మకూరు పీహెచ్‌సీ కొత్తపల్లి గ్రామ ఆశా కార్యకర్త ఎం.విమలను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్‌లు డిమాండ్‌ చేశారు. శుక్రవారం వారు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తహసీల్దార్‌ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లయ్య, పుల్లయ్య, ప్రసాద్‌, షబ్బీర్‌, నాగరాజు, శ్రీను, రాజేష్‌, ఓబులేష్‌, చంద్ర పాల్గొన్నారు.

ప్రార్థన కోసం చెత్త తొలగింపు పనులు



ఈద్గా వద్ద చెత్త తొలగింపు పనులు చేస్తున్న ముస్లింలు

పాములపాడు: రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం శుక్రవారం చెత్తా చెదారం తొలగింపు పనులు చేపట్టారు. ఉదయం నమాజు అనంతరం ఈద్గా వద్దకు చేరుకుని చెత్తను తొలగించి ట్రాక్టర్‌ డోజర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో మత పెద్ద ఇస్మాయిల్‌, మత గురువు మౌలానా సుభాన్‌ పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ఆలయానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న యాదవులు

జూపాడుబంగ్లా: శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని యాదవులు ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేశారు. నందికొట్కూరు నుంచి పాములపాడు వెళ్తూ ఎమ్మెల్యే జయసూర్య జూపాడుబంగ్లాలో కాసేపు నిలిచారు. ఈసందర్భంగా యాదవ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ వెంకటేశ్వర్లుయాదవ్‌ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 50 మంది యాదవులు ఎమ్మెల్యేను కలిసి శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన తహసీల్దార్‌ దృష్టికి తీసుకెళ్లి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు

బండిఆత్మకూరు: మండలం పరిధిలోని కడమల కాలువ గ్రామంలో శివనందీశ్వర స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. రూ.48,636 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్‌ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పి.హరిశ్చంద్రా రెడ్డి, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సైన్స్‌ పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారులు తెలిపారు. కొత్తపల్లి సెంటర్‌లో 175 మందికి గానూ 169 మంది, గోకవరం సెంటర్‌లో 87 మందికి గానూ 80 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.

- మహానంది: మహానంది మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం



వీరేష్‌ను సన్మానిస్తున్న ఏడీ, సిబ్బంది

జూపాడుబంగ్లా: లైవ్‌స్టాక్‌ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది బేతంచర్లకు బదిలీ అయిన వీరేష్‌ను శుక్రవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో వెటర్నరీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రామాంజనేయనాయక్‌, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం.. దైవాధీనం

పేదలకు వైద్యం దైవాధీనంగా మారింది. ఆస్పత్రుల్లో కూటమి ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయలు కూడా కల్పించక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌రేలు పని చేయడం లేదు. ఫ్యాన్లు తిరగడం లేదు. కనీసం గుక్కెడు తాగునీరు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉండడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు శాపనార్థాలు పెడుతున్నారు. ఈనెల 25న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానిన సాక్షి విజిట్‌ చేయగా పలు అంశాలు వెలుగు చూశాయి. – ఆత్మకూరు

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేదలకు అందని వైద్యం
- సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సౌకర్యం లేక విలవిల్లాడుతున్న రోగులు
- మూతబడిన ఎక్స్‌రే కేంద్రం.. మందులు, ఇంజెక్షన్లూ కరువే..
- అత్యవసర రోగులందరినీ కర్నూలుకే రెఫర్‌
- 'సాక్షి' విజిట్‌లో వెల్లడైన పలు ఆసక్తికర అంశాలు



ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల

సాక్షి విజిట్



బాలింతలు, చిన్నారుల గదుల్లో పనిచేయని ఫ్యాన్‌లు

ఆత్మకూరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఆత్మకూరు, కొత్తపల్లి, పాములుపాడు మండలాలతోపాటు నల్లమల అటవీ పరిధిలోని గిరిజన గూడేల గిరిజనులు వైద్యం కోసం వస్తున్నారు. రోజుకు 200 మందికి పైగా రోగులు వస్తున్నా సరైన వైద్యసేవలు అందడంలేదు. 30 పడకల వైద్యశాలలో రోగులకు కావాల్సిన మందులు, ఇంజెక్షన్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులకు సంబంధించిన మందులే కాదు.. బీకాంప్లెక్స్‌, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు కూడా బయటే తెచ్చుకోవాల్సి వస్తుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. మాత్రలు, ఇంజెక్షన్లు కూడా లేకపోవడం ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు.

తాగేందుకు నీళ్లు కూడా లేవు..

ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోజులకు, వారి సహాయకులకు కనీసం నీళ్లు కూడా లేవు. అసలే ఎండలు ఎక్కువయ్యాయి. గర్భిణులు సైతం వైద్యశాలకు వస్తున్నారు. వీరు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులు మూత్రశాలలకు, మరుగుదొడ్లకు వెళ్లాలంటే కూడా చుక్క నీరు లేని పరిస్థితి. ఆత్మకూరు నుంచి బిందె రూ.5 చొప్పున కొని వైద్యశాలకు తీసుకొచ్చి బాలింతలకు, శిశువులకు స్నానాలు చేయించుకుంటున్నారు. బోరును ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు పేర్కొన్నారు.

వైద్యుల కొరత

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏడుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా, నలుగురు మాత్రమే ఉన్నారు. వీరు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. జనరల్‌ వైద్యులు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికుల కొరత కూడా ఉండటంతో ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

అంతా కర్నూలుకే..

రాత్రివేళ గ్రామాల నుంచి వచ్చిన రోగులను వైద్యులు కనీసం చేయి పట్టుకుని కూడా చూడటం లేదనో ఆరోపణలున్నాయి. అసలు రాత్రి వేళల్లో వైద్యులే రారనే విమర్శలున్నాయి. రోడ్డు ప్రమాదాలతోనో, వివిధ ఆరోగ్య సమస్యలతోనో అత్యవసరంగా వైద్యశాలకు వెళ్తే అక్కడున్న కొద్ది మంది ఏఎన్‌ఎంలు సాధారణ చికిత్సలు చేసి వెంటనే కర్నూలుకు రెఫర్‌ చేస్తున్నారు. ఆ సమయంలో ప్రైవేట్‌ వాహనాలను పట్టుకుని కర్నూలుకు చేరేలోపు ప్రాణాలు పోయిన ఘటనలు కూడా ఉన్నాయని పలువురు ఆరోపించారు. ఇక ఆస్పత్రిలో ఎక్స్‌రేలు కూడా పని చేయడం లేదు. దీంతో ప్రైవేట్‌ ల్యాబ్‌లకు వెళ్లి రోగులు, క్షతగాత్రులు ఎక్స్‌రేలు తీయించుకుంటున్నారు.



వృథాగా ఉన్న ఎక్స్‌రే గది

మెరుగైన వైద్యసేవలు కల్పిస్తున్నాం

ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు కల్పిస్తున్నాం. కావాల్సిన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ల కొరత ఉన్న మాట వాస్తవమే. శ్రీశైలానికి కాలినడనక వెళ్లే భక్తులకు మందులను సరఫరా చేయడంతో ఇక్కడ కొరత ఏర్పడింది. రోగులకు మంచినీరు తదితర సౌకర్యాలను కల్పిస్తాం.

– రాయుడు, వైద్యాధికారి, ఆత్మకూరు

మందులు బయటకు రాసిస్తున్నారు



ఒకటి, రెండు మందులు మాత్రమే ఇచ్చి, మిగిలిన మందులను బయటకు రాస్తున్నారు. మల్టీ విటమిన్స్‌తో పాటు ఇంజెక్షన్లు, నొప్పుల మాత్రలు కూడా అందుబాటులో లేవు. వైద్యశాలకు వచ్చినప్పుడు మందులు తీసుకెళ్లాలన్నా అరకొరగా ఇచ్చి పంపుతున్నారు. – పీఎస్‌ ఖాన్‌, తిక్కయ్యస్వామి దర్గా, ఆత్మకూరు

ఎక్స్‌రే సౌకర్యం కల్పించాలి



ఎక్స్‌రేలు లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌రే ప్రైవేట్‌ ల్యాబ్‌లకు వెళ్లాలని చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్స్‌రే ఏర్పాటు చేయాలి – మహేశ్వరరావు, ఆత్మకూరు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు రఫీ, నాగరాజులను సన్మానిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని ప్రకృతి వ్యవసాయం నియోజకవర్గ కోఆర్డినేటర్‌ అయ్యస్వామి, ఏఓ కృష్ణారెడ్డి, ఏపీఎం అంబమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పొదుపు మహిళలకు, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించిన మండ్లెం రైతులు నాగరాజు, రఫీలను సన్మానించారు. కార్యక్రమంలో సెరికల్చర్‌ ఏఓ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాగునీరిచ్చి రైతులను ఆదుకోవాలి



వరి పైరును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మహానంది: సాగునీరిచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కోటకొండ బాషా డిమాండ్‌ చేశారు. శుక్రవారం గాజులపల్లె సమీపంలోని జంగిలిస్వామి దర్గా సమీపంలో వరి పొలాలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అరకొరగా నీళ్లు వదులుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ ఎన్నికల ముందు రెండు పంటలకు నీళ్లిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పైర్లు ఎండుతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే నీళ్లిచ్చి పంటలను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, నాగేంద్ర, మెహరాజ్‌, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్య వైశ్యులకు కిట్ల పంపిణీ

వెలుగోడు: స్థానిక వాసవీ కాంప్లెక్స్‌ నిరుపేద ఆర్య వైశ్యులకు ఉగాది సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు భవనాసి నాగమహేష్‌, మండల అధ్యక్షుడు బచ్చు రాము తదితరులు పాల్గొన్నారు.



పేద ఆర్యవైశ్యులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

30న తూడిచెర్లలో కబడ్డీ పోటీలు

జూపాడబంగ్లా: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న తూడిచెర్ల గ్రామంలో పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్లుయాదవ్‌, సురేష్‌యాదవ్‌, వేణుగోపాల్‌యాదవ్‌, శంకర్‌యాదవ్‌ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన 8790023280, 9908747631 ఫోన్‌ చేసి, రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

బండి ఆత్మకూరు: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌ రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించారు. పెద్ద దేవళాపురం, కడమల కాలువ, యర్రగుంట్ల గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం సబ్సిడీతో మంజూరైన వ్యవసాయ పరికరాలను ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్‌, తహసీల్దార్‌ పద్మావతి, ఎంపీడీఓ దస్తగిరి, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వర్సెస్‌ ఎమ్మెల్యే

- ఫీల్డ్‌ అసిస్టెంట్‌ల ఎంపికలో కలెక్టర్‌కు వేర్వేరుగా సిఫారసు లేఖలు
- కొద్ది రోజులుగా కొనసాగుతున్న సందిగ్ధత
- తలలు పట్టుకుంటున్న అధికారులు

పగిడ్యాల: నందికొట్కూరు నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. నువ్వా నేనా అన్నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు అధికార పెత్తనం చెలాయిస్తుండడంతో ఉద్యోగుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇద్దరూ కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైనప్పటికీ పరస్పర వైరుధ్యంతో వ్యవహరిస్తూ విమర్శలకు అవకాశం కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే రెడ్‌బుక్‌ రాజ్యాంగం అమలుకు శ్రీకారం చుట్టింది. వారి పైశాచికత్వానికి అమాయకులైన ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడుతున్నారు. మండలంలోని పడమర ప్రాతకోట, పగిడ్యాల గ్రామ పంచాయతీల ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు కురుమన్న, రమేష్‌లపై 18వ సామాజిక బృందం అవినీతికి పాల్పడలేదని ఎలాంటి రికవరీలు లేకుండా క్లీన్‌చిట్‌ ఇచ్చింది. అయినా తమ అనుయాయులకు ఫీల్డ్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఇప్పించుకోవడానికి బలవంతంగా వారిపై అవినీతి మరకను రుద్దుతూ డ్వామా పీడీ చేత షోకాజ్‌ నోటీసులు జారీ చేయించడంలో ఎమ్మెల్యే కీలక భూమిక పోషించినట్లు తొలగింపుకు గురైన ఫీల్డ్‌అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా కొనసాగుతూ వస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌ల నియామకం కోసం ఎమ్మెల్యే ఒకరిని, ఎంపీ మరొకరిని రెకమెండ్‌ చేస్తూ కలెక్టర్‌కు, డ్వామా పీడీకి సిఫారసు లేఖలు అందించడం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ల నియామకం ఆలస్యమవుతోందని మండల స్థాయి అధికారులు పేర్కొనడం గమనార్హం. విడువమంటే పాముకు కోపం.. కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా ఉద్యోగులు పరిస్థితి తయారైంది. ఏదిఏమైనా ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌ల నియామకంలో జిల్లా స్థాయి అధికారులు ఎవరి సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకుంటారో, లేక ఎలాంటి అవినీతికి పాల్పడని పాత వారినే కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై ఏపీఓ మద్దిలేటిని వివరణ కోరగా ఎమ్మెల్యే తరఫున అడ్డాకుల రమేష్‌, ఎంపీ వర్గం తరఫున రంగన్నలు సిఫారసు లేఖలు తెచ్చుకున్నారని, తమ పరిధిలో ఏమీ లేదని అంతా జిల్లా అధికారుల చేతల్లోనే ఉందని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

నందికొట్కూరు: ఉగాది, రంజాన్‌ సెలవు రోజుల్లోనూ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్లు సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం అధికారి ఎస్‌.ఎం మౌలా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆది, సోమవారాలు రెండు రోజులు సెలవు దినాలైనా ప్రభుత్వం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం పని చేస్తుందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెరిచే ఉంటుందని, ప్రజలు, రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆత్మకూరు: ఈనెల 30, 31 తేదీల్లో (ఆదివారం, సోమవారం) రిజిస్ట్రేషన్‌ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని సబ్‌ రిజిస్ట్రార్‌ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోం చేసుకోవాలన్నారు.

సీఎం రిలీఫ్‌ చెక్కులు పంపిణీ

పాములపాడు: మండలంలోని మద్దూరు, పాములపాడు, వేంపెంట, రుద్రవరం, లింగాల గ్రామాల్లో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం వేంపెంట గ్రామంలోని హెల్త్‌ సెంటర్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించి ఉద్యోగుల సంతకాలు లేకపోవడంతో డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తామని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్‌, ఈఓపీఆర్డీ రంగనాయక్‌, ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.

30న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శన

పాములపాడు: ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 30న మండలంలోని మద్దూరు గ్రామంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటకం ప్రదర్శించనున్నట్లు కార్యనిర్వహణాధికారి జనార్దన్‌, మండల మాజీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈశ్వర, వీరభద్ర, ఆంజనేయ, చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలో నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్‌

ఆత్మకూరు: దోపిడీ కేసులోని నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. స్థానిక మార్కెట్‌యార్డు వద్ద ఈనెల 25న రాత్రి బీరువాల షాపు బయట నిద్రిస్తున్న గయాజ్‌ వద్దకు మూర్తుజావలి, రమణ వచ్చారు. అతడిని నిద్రలేపి డబ్బు ఇవ్వాలని బెదిరించారు. మూర్తుజావలి తన చేతికున్న కడియంతో గయాజ్‌ని కొట్టి గాయపరిచి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌, రూ.50 నగదు లాక్కుని బైక్‌పై పారిపోయారు. గయాజ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉదయం 9 గంటల సమయంలో ఉర్దూ పాఠశాల వద్ద ఉన్న నిందితులిద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైకు, కడియం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ సూపరింటెండెంట్‌ దేవిక ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, శాంతారాంభట్‌, హనుమంతశర్మ, అర్చకుడు సునీల్‌ ముందుగా అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతుల అనంతరం మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీల మధ్య ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం కనుల పండువగా సాగింది.



పుడమి తల్లికి ఎర్ర తివాచీ!

ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 11 వేల హెక్టార్లలో మిరప సాగైంది. ప్రస్తుతం నంద్యాల, మహానంది, పాణ్యం తదితర మండలాల్లో మిరప కోతలు పూర్తికాగా పొలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. విస్తారంగా ఆరబోసిన మిరపకాయలతో పుడమితల్లిపై ఎర్రటి తివాచీ పరిచినట్లు కనిపిస్తోంది. – మహానంది

మద్దతు ధరకు పేర్లు నమోదు చేసుకోండి

కొత్తపల్లి: కందులు, మినుములు, శనగలు మద్దతు ధరకు విక్రయించుకునేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్‌ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కందులు క్వింటా రూ.7,550, శనగలు రూ.5,650, మినుములు రూ.7,400 మద్దతు ధర ప్రకటించిందని, రైతులు ఆధార్‌ కార్డు, ఆధార్‌కు లింక్‌ అయినా ఫోన్‌ నంబర్‌తో రైతు సేవ కేంద్రంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

నంద్యాల: బీడు భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్‌ జి.రాజకుమారి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో నాణ్యమైన ఉల్లి, మిర్చి, పసుపు పెంపకం కోసం హార్టికల్చర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వర్క్‌ షాప్‌లో కలెక్టర్‌ పాల్గొని మాట్లాడారు. డొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఖరీఫ్‌ చివరిలో మూడు నెలలు మాత్రమే 2 లక్షల ఎకరాల్లో శనగ పంట వేసి తర్వాతి 9 నెలల సమయమంతా బీడు భూములుగా వదిలేస్తున్నారన్నారు. ఇలా వదిలేయకుండా ఆ భూముల్లో ఉద్యాన పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో హార్టికల్చర్‌ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, మార్క్‌ఫెడ్‌ డీడీ హరినాథ్‌ రెడ్డి, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేయాలని కలెక్టర్‌ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌లో ఉగాది ఉత్సవాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ మాట్లాడుతూ పండుగ రోజు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అండర్‌ వే బ్రిడ్జి నిర్మించాలి

ఆత్మకూరు: జాతీయ రహదారి దాటేందుకు కరివేన గ్రామంలో అండర్‌ వే బ్రిడ్జ్‌ నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నరసింహనాయక్‌, మండల నాయకులు సి.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జాతీయరహదారిని దాటేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదలు చోటుచేసుకోకుండా హైవే అధికారులు స్పందించి కరివేన గ్రామంలో అండర్‌ వే బ్రిడ్జి నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

తంగడంచ ఫారం భూములను అభివృద్ధి చేయండి

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములను అభివృద్ధి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రమేష్‌బాబు కోరారు. శుక్రవారం ఆయన అమరావతి సచివాలయంలో ఏపీ వ్యవసాయశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM 1st ADDITIONAL DISTRICT JUDGE, ANANTAPUR

M.V.O.P.No. 209 / 2019

Between :

S. Mallika Begum & others ... Petitioners

Vs.

V.Naga Malla Reddy & others ... Respondents

Notice to R-4

To,

S.Murthuja, S/o Mahaboob Basha, R/o 28-30, Atmakur Town, Nandyal District.

Whereas the above named petitioners have been made an application to this court for grant of compensation against the respondents, you are hereby wanted to appear in the court in person or through a pleader duly instructed on the 7th day of April, 2025 at 10.30 AM to show cause against the application, failing which said application will be heard and determined ex-parte.

By Order of Court

B.NARAYANA REDDY, Advocate for Petitioners, Anantapur. Cell: 9849291120